# కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం

- బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి



మహిళలకు నమస్కరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, నవంబర్ 23: బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని.. కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకుందామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన వేములవాడలో పట్టణంలోని 12వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి ఇంటింటా ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం సాధించుకున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కరెంటు దిక్కు ఉండదని అవహేళన చేసిందన్నారు. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు, కృష్ణ, గోదావరి జలాలపై ప్రాజెక్టులు నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేశారని గుర్తు చేశారు. నేటి యువతరానికి కరెంటు ఉండాలనేది బాధ్యతగా తెలిసిందంటే అది ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనతోనే అని అన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఇవన్నీ వట్టి ఖర్చులని.. నిరుపేద బలహీన వర్గాలకు అందుతున్న పథకాలపై అవహేళనగా మాట్లాడుతున్నారని, వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. 1,056 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాల చిన్నారులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ 35 మెడికల్ కాలేజీలు పెట్టి ఏడాదికి పదివేల మంది డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు మోకాలు కీలు మార్పిడి వంటి ఆపరేషన్లు అమెరికా వంటి ఉన్నత దేశాల్లో జరిగేవని, సీఎం కేసీఆర్ పాలనలో వేములవాడ వంటి పట్టణంలో ప్రభుత్వ దవాఖానలో జరుగుతున్న తీరే అభివృద్ధికి నిదర్శనమని కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వాలను మహిళలే కాపాడుకోవాలని చెప్పారు.

### కాంగ్రెస్ బీజేపీకి ఓటేయవద్దు

కాంగ్రెస్, బీజేపీ నాయకులు కపట ప్రేమతో మీ ముందుకు వస్తున్నారని, వారిని నమ్మి మోసపోయి ఓటేయవద్దని కోరారు. ప్రేమ లేదని పార్టీలల్లో ఉండడం వల్లనే ఆది శ్రీనివాస్ ఓటమి చవి చూస్తున్నాడని అన్నారు. వం ద సీట్లతో అధికారంలోకి రాబోతున్నామని తెలిపారు. వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్ రామతీర్థపు కృష్ణవేణి, ఎంపీపీ మల్లేశం, కో ఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్, నాయకులు రామతీర్థపు హరీశ్, తీగల వెంకటేశ్వర్‌రావు, రామతీర్థపు రాజు, ముప్పిడి శ్రీనివాస్, గోపు బాలరాజు, రాంబాబు, సత్యనారాయణరెడ్డి, కృపాల్ పాల్గొన్నారు.

### అవకాశం ఇస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

వేములవాడ ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్త. ఎమ్మెల్యే రమేశ్‌బాబు చేసిన అభివృద్ధితోపాటు మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేస్త. వేములవాడ పట్టణం, రాజన్న ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుత. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్త. ఒక్కసారి నన్ను ఆశీర్వదించండి.

**- చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

# అబద్ధాల 'ఆది'ని ఎవరూ నమ్మరు

- తెలంగాణ రావడం ఇష్టంలేనోళ్లు ఓట్ల కోసం మీ ముందుకు వస్తున్నరు
- వారికి తగిన గుణపాఠం చెప్పాలె
- 'చల్మెడ'ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- డివిజన్‌స్థాయి ఆటో కార్మికులతో సమావేశంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- ఆటో కార్మికుల వెన్నంటే ఉంటా: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ


వేములవాడ, నవంబర్23: నిత్యం అబద్ధాలు చెప్పే ఆది శ్రీనివాస్‌ను వేములవాడ నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని సంగీత నిలయంలో డివిజన్ స్థాయి ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మోచేతి నీళ్లు తాగి, తెలంగాణ రావడానికి ఇష్టపడని వాళ్లంతా.. ఓట్ల కోసం మాత్రమే మీ దగ్గరకు వస్తున్నారని.. వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నియోజకవర్గాన్ని గడిచిన పదేండ్లలో ₹4,500 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. సాగునీరు, తాగునీరు, రోడ్లు ఇవన్నీ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కుమ మాత్రమే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పదవులకు రాజీనామా చేయని, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు ఓట్ల కోసం వస్తున్నారని నిలదీయాలని ప్రజలకు సూచించారు. రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలియని మరో బీజేపీ నాయకుడు కాషాయం జెండా ఎగురవేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి ప్రదాతగా కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేద్దామని, వేములవాడలో ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దేవరాజు, కౌన్సిలర్లు సిరిగిరి రామచందర్, యాచమనేని శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్, బాబున్, నాయకులు జడల శ్రీనివాస్, అంజద్‌పాషా పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల వెన్నంటే ఉంటా..

ఆటో కార్మికులకు ఏ సమస్య వచ్చిన వెన్నంటే ఉంటా. కార్మికుల సంక్షేమానికి మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ తగిన ప్రాధాన్యత ఇచ్చారు. ఒక్కసారి అవకాశం ఇస్తే కార్మికుల కుటుంబాలకు ఏ ఆపద వచ్చిన వెన్నంటి ఉంటా. అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. కారు గుర్తుకే ఓటేసి భారీ మెజార్టీ అందించండి.

***- చల్మెడ లక్ష్మీనరసింహారావు, వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి***





సంగీతం ఆలయంలో సమావేశానికి హాజరైన వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ సభ్యులు

# ప్రగతిని చూసి పట్టంకట్టండి

- బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి
- కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడుతాం
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



అనంతారంలో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న గ్రామస్తులు

ఇల్లంతకుంట, నవంబర్ 23: బీఆర్ఎస్ హయాంలో తొమ్మిదిన్నర ఏండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి పట్టంకట్టాలని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన జంగంరెడ్డిపల్లి, అనంతారం, వల్లంపట్ల, ముస్కానిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ, దొంగ మొక్కులు, ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇస్తూ ప్రజల్లో తిరిగే కాంగ్రెస్ నేతలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వాళ్లు ఇక్కడ ఇస్తున్న హామీలు వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ఎందుకంటే ఆ హామీలు అమలు చేయడం సాధ్యం కాదనే విషయం వారికి తెలుసనీ, కేవలం అధికార దాహం కోసం మాత్రమే వారు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడితే కరెంటు తీగలపై బట్టలు ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని నాటి ముఖ్యంత్రి చెప్పాడని, కానీ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు 24గంటలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. 55 ఏండ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ చేయని అభివృద్ధిని, ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో పదేండ్లలోనే చేసి చూపించామన్నారు. మరోసారి కారు గుర్తుకే ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతపల్లి వేణురావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, సర్పంచులు చల్ల నారాయణ, కేతిరెడ్డి అనసూయ, తూంకుంట శ్రీలత, పీఏసీఎస్, ఏఎంపీ డైరెక్టర్లు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం
- సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించేలా విస్తృత ప్రచారం చేయాలి
- బూత్‌స్థాయి కార్యకర్తలతో సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



బూత్‌స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబర్ 23: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించామని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతుబంధు, రైతు బీమా, పింఛన్లు, నిరంతర విద్యుత్, మెరుగైన విద్య, వైద్య సదుపాయాలతో పాటు అభివృద్ధిని గడపగడపకూ వివరిస్తూ మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రభుత్వం ఇంటింటికీ అందిస్తున్న ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసీఆర్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించేలా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, వైస్ ఎంపీపీ దోసల లత, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, లింగన్నగారి దయాకర్‌రావు, గంద్యాడపు రాజు, కమ్మరి రాజారాం, పెద్దవేని వెంకటియాదవ్, లక్కిరెడ్డి లత, నాగరాజు గౌడ్, గోగు లింగంయాదవ్, బాలవ్వ, నిరంజని, చేరాల వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.